'మనూ'లో ఎంబీఏ, ఎంకామ్ కోర్సులలో ప్రవేశాలు

దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ మే 20

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలో ఉర్దూ మాధ్యమంలో ఎంబీఏ, ఎంకామ్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నామని ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్ మంగళవారం తెలిపారు. ఏఐసీటీఈ సిఫార్సు చేసిన సిలబస్‌నే బోధిస్తున్నామన్నారు. ఏదైనా సబ్జెక్టులో 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ప్రవేశ ఆధారిత ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి అర్హులని ఆయన వివరించారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను సమర్పణకు చివరి తేదీ మే 20గా నిర్ణయించడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఉర్దూ మాధ్యమంలో మెరిట్ ఆధారిత ఎంకామ్ కోర్సులో ప్రవేశాలను కూడా అందిస్తోందని, దీనికోసం దరఖాస్తును సమర్పించడానికి చివరి తేదీగా జూన్ 30గా నిర్ణయించామన్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నెంబర్‌లు 9849325765, 9849847434లలో సంప్రదించాలని కోరారు. యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో వివరాలు చూడొచ్చన్నారు.

'ఐఎఫ్ఎస్'కు ఎంపికైన పెద్దిరెడ్డి వాసంతి

హర్షం వ్యక్తం చేసిన హెచ్‌సీయూ ఫ్యాకల్టీ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిని పెద్దిరెడ్డి వాసంతి ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యారు. ఆమె సివిల్ సర్వీసెస్ ఐఎఫ్ఎస్ విభాగంలో ఆలిండియా స్థాయిలో 50వ ర్యాంకు సాధించింది. ఈ మేరకు మంగళవారం హెచ్‌సీయూ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌సీయూలో ఆమె హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ బ్యాచ్ 2015–17లో ఎంబీఏ చేశారు. ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కి ఎంపిక కావడం హెచ్‌సీయూకు గర్వకారణమని ఫ్యాకల్టీ ప్రతినిధులు పేర్కొన్నారు.

జేఎన్‌వీ హైదరాబాద్ దేశంలోనే టాప్

జేఎన్‌వీ హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలాకృష్ణ

రాయదుర్గం: సీబీఎస్ఈ పది, పన్నెండవ తరగతి బోర్డు పరీక్షలలో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ జయకేతనం ఎగురవేసింది. దేశంలోని అన్ని రీజియన్లలో హైదరాబాద్ రీజియన్ టాప్ స్థానంలో నిలిచింది. ఈ మేరకు మంగళవారం శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ రీజియన్ కార్యాలయంలో వివరాలను రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలాకృష్ణ వివరించారు. దేశ వ్యాప్తంగా 8 రీజియన్లు ఉండగా హైదరాబాద్ రీజియన్ సీబీఎస్ఈ బోర్డు పరీక్షలలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు.

బీసీ కులవృత్తుల కార్పొరేషన్ అవసరం

లిబర్టీ: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులవృత్తులను కాపాడాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి కోరారు. క్రమంగా కులవృత్తులు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరతరాలుగా సంప్రదాయ కులవృత్తులను నమ్ముకొని జీవనం సాగిస్తున్నవారిని కాపాడటంతోపాటు ఆర్థికంగా చేయూతనివ్వటానికి బీసీ కులవృత్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. గీత, నేత, కుమ్మరి, వడ్రంగి వంటి అనేక కులవృత్తుల వారు నేటికీ తమ జీవితాల్లో వెలుగు లేక ఆర్థికంగా చితికిపోయి ఉన్నారని తెలిపారు. కులవృత్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసి కార్పొరేషన్ ఏర్పాటుకు జీవో జారీ చేయాలని కోరారు.

బొట్టుబిళ్లలతో 'జై శ్రీరామ్'

రాముడిపై భక్తిని చాటుకున్న మహిళా కళాకారులు

పంజగుట్ట: రాముడిపై ఉన్న భక్తిని వినూత్నంగా చాటుకున్నారు ఆరుగురు మహిళలు. ప్రతీరోజు ఐదు గంటలు, మొత్తంగా 12 రోజులు ఎంతో నిష్టగా ఉంటూ 32,970 బొట్టు బిళ్లలతో 30/40 అట్టపై తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో జై శ్రీరామ్ అని రూపొందించారు. దీనికి అయోధ్య ప్రాజెక్ట్ అని పేరు పెట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అయోధ్య ప్రాజెక్టును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టును రూపొందించిన కాసుల పద్మావతి, సూర్యకుమారి, యోగలక్ష్మి, ప్రతిభా ధల్, రజనీ మంచికంటి, కోమలి మాట్లాడుతూ.. ఉమెన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ బ్యానర్‌పై దీన్ని రూపొందించినట్లు తెలిపారు. 16,314 నారింజ బొట్టుబిళ్లలు, 3,192 నీలం బొట్టుబిళ్లలు, 13,464 ఆకుపచ్చ బొట్టుబిళ్లలతో దీన్ని తయారు చేశామన్నారు. ఏప్రిల్ 19న ఏకాదశి రోజు ఈ పవిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. మాంసాహారం తినకుండా, ఎంతో పవిత్రంగా ఉంటూ రూపొందించామని తెలిపారు. డిసెంబర్‌లో తమ బృందం అయోధ్యకు వెళ్లి అయోధ్య మ్యూజియంలో దీన్ని ఉంచనున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని కాసుల పద్మావతి చిత్రకళా అకాడమీలో ప్రతీరోజు 5 గంటలు కష్టపడి దీనిని రూపొందించామని పేర్కొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో సత్తాచాటిన విజ్ఞాన్ విద్యార్థులు



నిజంపేట్ విజ్ఞాన్ స్కూల్‌లో సీబీఎస్ఈలో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

నిజాంపేట్: విద్యార్థులపై ఉపాధ్యాయులు చూపిన ప్రత్యేక శ్రద్ధతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని విజ్ఞాన్ సంస్థల వైస్ చైర్మన్ రాణి రుద్రమదేవి అన్నారు. నిజంపేట్ విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు సీబీఎస్ఈలో మెరుగైన ఫలితాలు సాధించారు. ఈ నేపథ్యంలో మంగళవారం పాఠశాల ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పాఠశాలకు చెందిన వైష్ణవి (498/500)అత్యధిక మార్కులు సాధించి స్టేట్ రాంక్ సాధించగా, సాయి తేజోఆరుణిమ (496/500), ప్రణవ్‌రామ్ మనోహర్ (493/500), హార్థిక 490/500 మార్కులు సాధించారు.

◆ ఈ సందర్భంగా రాణిరుద్రమదేవి మాట్లాడుతూ... తమ పాఠశాలకు చెందిన 380 మంది విద్యార్థులు 80 శాతానికి పైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు. ప్రణాళికబద్ధమైన బోధన, సిలబస్ రివిజన్, అంతర్గతంగా పరీక్షలు నిర్వహించడంతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యపడ్డాయన్నారు.

◆ అనంతరం బ్రాంచ్ ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ... విద్యార్థులు మంచి మార్కులు సాధించడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. వారిచ్చిన సూచనలు, ప్రోత్సాహంతోనే స్టేట్ ర్యాంకులు సాధించగలిగామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను శాలువలతో సత్కరించారు.

మళ్లీ అదే నిర్లక్ష్యం.!

ఎంత చైతన్య పరిచినా పోలింగ్ బూత్‌కు రాని ఓటర్లు

దుండిగల్: 'రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి'.. 'ఓటు వేయడం మన బాధ్యత'అంటూ అటు ఎన్నికల సంఘం అధికారులు, సినీ సెలబ్రిటీలు, స్వచ్ఛంద సంస్థలు, పలువురు వలంటీర్లతో పాటు సోషల్ మీడియాలో కొన్ని రోజులుగా విస్తృతంగా ప్రచారాలు చేశారు. కానీ ఇవేమీ ఓటరును పోలింగ్ కేంద్రానికి రప్పించలేకపోయాయి. 'నవ్విపోదురుగాక నాకేమి సిగ్గు' అన్న చందంగా కొందరు ఓటర్లు తాపీగా ఇంట్లో కూర్చోనో.. లేక సెలవు వచ్చిందని షికారుకో వెళ్లినట్లు పోలింగ్ సమయంలో కనిపించింది.

50 శాతమే నమోదు..

దేశంలోనే అతి పెద్ద లోక్‌సభ నియోజకవర్గమైన మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 7,24,992 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 3,78,362 మంది పురుషులు, 3,46,468 మహిళలు, ఇతరులు 162 మంది ఉన్నారు. కానీ సోమవారం జరిగిన ఎన్నికల్లో కేవలం 50 శాతమే పోలింగ్ నమోదైంది. మొత్తం 3,63,874 మంది ఓట్లు వేయగా వారిలో 1,91,436 మంది పురుషులు, 1,72,390 మంది మహిళలు ఉన్నారు.

> **ఆంధ్రా ఎన్నికల ఎఫెక్ట్..**
> నియోజకవర్గంలోని ప్రగతినగర్,నిజాంపేట,బాచుపల్లి, కొంపల్లి, చింతల్ ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు అధికంగా ఉంటున్నారు.పక్క రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇక్కడి నుంచి వేలాది మంది ప్రజలు అక్కడ ఓటు వేసేందుకు తరలి వెళ్లారు. ఇక్కడ ఓటింగ్ శాతం తగ్గడంలో వారి ఎఫెక్ట్ స్పష్టంగా కనిపిస్తోంది.

అసెంబ్లీ ఎన్నికల్లో 52.79 శాతం.. పార్లమెంట్ ఎన్నికల్లో 50.19శాతం పోలింగ్..

ప్రస్తుతం నియోజకవర్గంలో 7,24,992 మంది ఓటర్లు ఉన్నారు.గత సంవత్సరం డిసెంబర్ నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అప్పట్లో మొత్తం 6,99,130 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటితో పోల్చుకుంటే కేవలం ఐదు నెలల్లోనే 25,862 మంది కొత్త ఓటర్లుగా నమోదు చేయించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 52.79 శాతం ఓటింగ్ నమోదు కాగా ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో 50.19 శాతం నమోదైంది. 25 వేలకు పైగా కొత్తగా ఓటర్లు నమోదైనా ఐదు నెలల కాలంలోనే 2.6 శాతం పోలింగ్ తగ్గింది.

ఇప్పుడు మగవాళ్లు..

గత అసెంబ్లీ ఎన్నికల్లో పురుషుల కంటే మహిళల ఓటింగ్ శాతం అధికంగా నమోదైంది. అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 6,99,130 ఓటర్లు ఉండగా వారిలో 3,66,707 పురుషులు, 3,32,364 మహిళలు ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 2,06,973, మహిళలు 1,92,828 మంది ఓట్లు వేశారు. పురుషులు 56 శాతం, మహిళలు 58 శాతం ఓటింగ్‌లో పాల్గొన్నారు.

ప్రాంతం	ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
దుండిగల్	60,945	34,078	55.92
కొంపల్లి	34,496	19,022	55.14
బాచుపల్లి	75,183	31,130	41.41
నిజాంపేట్	67,911	28,275	41.64
జంట సర్కిళ్లు	4,86,457	2,50918	51.58
మొత్తం ఓటర్లు	7,24,992	3,63,423	50.19

కానీ ఈ దఫా పురుషులు 52.61 శాతం, మహిళలు 47.37 శాతం ఓటింగ్‌లో పాల్గొన్నారు. గత ఎన్నికల్లో మహిళలు రెండు శాతం ఆధిక్యం సాధించగా ఈ ఎన్నికల్లో వారి కంటే పురుషులు 5 శాతం మెజార్టీ సాధించారు.

దూరంగానే ట్రాన్స్‌జెండర్లు..

గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లో ట్రాన్స్‌జెండర్లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 162 మంది ఉండగా 48 మంది ఓటు వేశారు. సూరారం కాలనీలోనే అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నాగులూరు టాప్..

పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం 592 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 600 నుంచి 1500 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ నాగులూరు ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 640 మంది ఓటర్లు ఉండగా 514 మంది ఓటు వేశారు. ఇక్కడ అత్యధికంగా 80.31 శాతం పోలింగ్ నమోదైంది. కాగా బాచుపల్లిలోని సిల్వర్ ఓక్స్ స్కూల్‌లో 847 మంది ఓటర్లకు గాను కేవలం 238 మంది మాత్రమే ఓటు వేశారు. ఇక్కడ అత్యల్పంగా 28.10 శాతం మాత్రమే నమోదైంది.



పోలింగ్ సరళి..

నియోజకవర్గంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్లు ఉన్నాయి, ఇందులో అత్యధికంగా దుండిగల్‌లో 55 శాతం పోలింగ్ నమోదు కాగా అత్యల్పంగా నిజాంపేటలో 41 శాతం నమోదైంది. గత అసెంబ్లీతో పోల్చుకుంటే అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతం గణనీయంగా తగ్గింది.

రిజర్వాయర్ చాంబర్లలో చెత్తాచెదారం



షాపూర్‌నగర్ నుంచి బాలానగర్‌కు వెళ్లే రిజర్వాయర్ చాంబర్‌లో చెత్తాచెదారం, లీకేజీ



కుత్బుల్లాపూర్‌కు సరఫరా చేసే చాంబర్‌లో వాల్వ్ లీకేజీ. పేరుకుపోయిన చెత్త

చింతల్: కూకట్‌పల్లి డివిజన్ ఫతేనగర్, బాలానగర్‌కు వచ్చే తాగునీటి రిజర్వాయర్ స్థలాబావంతో కుత్బుల్లాపూర్‌లో నిర్మించిన విషయం తెలిసిందే. షాపూర్‌నగర్‌లో నిర్మించిన ఈ 7.5 ఎంఎల్ రిజర్వాయర్ ద్వారా కొన్ని కుత్బుల్లాపూర్‌లోని కొన్ని బస్తీలకు సరఫరా చేస్తూనే.. ప్రధానంగా బాలానగర్, ఫతేనగర్‌లకు సరఫరా జరుగుతోంది. కానీ ఈ రిజర్వాయర్ వద్ద ఉండే మ్యాన్‌హోల్‌ల వద్ద లీకేజీలు ఏర్పడి నీరు చాంబర్ మొత్తం నిండిపోతుంది. మరలా రిజర్వాయర్ నుంచి పంపింగ్ నిలిపివేయగానే చాంబర్‌లో ఉన్న నీరు తిరిగి పైపులైన్‌లలోకి చేరుతోంది. ఈ క్రమంలో చాంబర్‌లో చెత్త చెదారం నిండిపోవడంతో దోమలు వ్యాప్తి చెంది అదే నీరు సరఫరా అవుతోంది. దీంతో అరకొరగా వచ్చే నీరు సైతం చెత్త చెదారంతో సరఫరా చేస్తున్నట్లేనని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణ కట్టమైసమ్మ

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ శ్రీకట్ట మైసమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ ప్రతినిధి వివేక్‌రెడ్డి, శైలజ దంపతులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం దుర్గయ్య కుమార్తె అక్షిత చేతుల మీదుగా అన్నదానం చేశారు.

కనులపండువగా తిరు కల్యాణం



తిరు కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ సౌభాగ్యనగర్‌లోని అలువేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తిరు కల్యాణం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు జరిగిన కల్యాణమహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి 7గంటలకు శ్రీకృష్ణ ఫలపుష్ప శయాదివాసం, 7.30 గంటలకు రథోత్సవం కనులపండువగా జరిగింది.

'మా కాలనీలో సీసీ రోడ్లు లేవు'


నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్న కాలనీవాసులు



వెంకటాద్రినగర్‌లో సీసీరోడ్లు లేని ప్రాంతం

జీడిమెట్ల: కాలనీలో సీసీ రోడ్లు వేయించాలని ప్రజలు కోరుతున్నారు. సుభాష్‌నగర్ డివిజన్‌లోని వెంకటాద్రినగర్‌లో ఫాక్స్‌సాగర్ కింది ప్రాంతంలో కొన్ని ప్రాంతాల్లో సీసీరోడ్ల నిర్మాణం జరగలేదు. దీంతో వర్షం కురిసిన ప్రతిసారి రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. కాలినడకన ప్రయాణం సాగించాలంటే ఇబ్బందిగా ఉందని ప్రజలు అంటున్నారు. దాదాపు కాలనీలో 80శాతం మేర రోడ్లు పూర్తి అయ్యాయని మిగిలిన 20శాతం రోడ్లను వేస్తే బాగుంటుందని కాలనీవాసులు కోరుతున్నారు. ఇప్పటికే సదరు రోడ్లలో యూజీడీ పనులను పూర్తి చేయగా సీసీ రోడ్డు పనుల మాత్రం పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని త్వరగా సీసీ రోడ్లు పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రాలాయి.. పూచాయి.!





గాజులరామారావు మెట్‌కానిగూడలోని ఓ వెంచర్లు పది రోజుల క్రితం ఓ చెట్టు ఆకులు, పూలు రాలిపోయాయి మోడుగా మారింది. ఇప్పుడు ఆ చెట్టుకు ఎర్రటి పూలు పూయడంతో అందరినీ ఆకట్టుకుంటోంది. – సుభాష్‌నగర్

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తా



కుత్బుల్లాపూర్: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆయనను కలిశారు.ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయనకు విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన వివేకానంద్ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని అధికారులను సమన్వయం చేస్తు వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పలు ప్రాంతాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంక్షేమ సంఘాల నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ శుభ్రం చేయాలి



అంగడిపేట్‌లో మ్యాన్‌హోల్ నుంచి తెల్లటి రంగులో గడ్డకట్టిన సబీనా పౌడర్

సుభాష్‌నగర్: జీడిమెట్ల డివిజన్ అంగడిపేట్‌లోని ప్రధాన రోడ్డులో వారానికోసారి డ్రైనేజీ పైప్‌లైన్‌ను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. స్థానికంగా రెండు ప్రధాన హోటళ్లు ఉండటంతో వాటిలో ఆహారం పాత్రలను సబీనా పౌడర్‌తో కడగటం, ఇతర పదార్థాలను డ్రైనేజీలో వదలటంతో తరచూ సమస్య తలెత్తుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో వారం రోజుల వ్యవధిలో డ్రైనేజీ పైపుల్లో తెల్లటి రంగుల గడ్డలు కట్టడం వలన డ్రైనేజీ నీరు దిగవ ప్రాంతానికి వెళ్లక ఎక్కడికక్కడ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్నాయి. దీంతో హోటల్ నిర్వాహకులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా భగీరథ జయంతి ఉత్సవాలు



భగీరథ మహరాజులు చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: ఒంటి కాలిపై తపస్సు చేసి పవిత్ర గ్రంథాన్ని దివి నుంచి భూమికి తీసుకొచ్చిన మహనీయులు భగీరథ మహారాజు అని మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్ అన్నారు. భగీరథ జయంతి ఉత్సవాలను మంగళవారం కొంపల్లిలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాకతీయుల కాలంలో చెరువులను తవ్వింది సగరులేనని అన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో సగరుల అభివృద్ధికి కృషి చేశానన్నారు. మేడ్చల్ జిల్లా సగర ఉప్పర సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు నర్సింహసాగర్, ఎంబీసీ డీఎస్‌టీ జాతీయ సంక్షేమ సంఘం మాదంశెట్టి సువర్ణసాగర్, పి.సతీష్ సాగర్, మాదమ్ శెట్టి కృష్ణసాగర్, టి.నరసింహసాగర్, కౌన్సిలర్ రాజిరెడ్డి, ప్రశాంత్‌గౌడ్, ఉదయ్, పెద్ద బుద్దుల శేఖర్, రాజసాగర్, గంగరాజు, ఉదయ్‌సాగర్, ఆనంద్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తుర్రున పోతే.. సర్రున జారుతారు!



షాపూర్‌నగర్ చౌరస్తా నుంచి గాజులరామారం వైపు వెళ్లే రోడ్డులో మేటలు వేసిన ఇసుక



చింతల్ - షాపూర్‌నగర్ ప్రధాన రహదారిలో..

రంగారెడ్డినగర్: ప్రధాన రహదారుల్లో ఇసుక, దుమ్ము పేరుకుపోతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రహదారుల్లో ఇసుక మేటలు వేసింది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారుల్లో రాకపోకలు సాగించే సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు పేరుకుపోయిన ఇసుక గుండా వెళ్లే సమయంలో జారి పడుతున్నారు. షాపూర్‌నగర్ చౌరస్తా నుంచి గాజులరామారం వైపు వెళ్లే రోడ్డులో, చింతల్– షాపూర్‌నగర్ రహదారిలో పలు చోట్లు ఇసుక రోడ్లపైకి చేరి రాకపోకలకు ప్రమాదకరంగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక, దుమ్ములను తరలించి రాకపోకలకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఓటింగ్ తప్పనిసరి చేయాల్సిందేనా?

- అవగాహన కల్పించినా స్పందించని ఓటర్లు
- చైతన్య పరిచినా ఓటర్లలో రాని మార్పు
- ఓటింగ్ పెంపునకు చేసిన కృషి వృథా
- ఓటింగ్ తప్పనిసరి చేయాలంటున్న విశ్లేషకులు
- అప్పుడే 100 శాతం ఓటింగ్ సాధ్యం.. లేకుంటే ప్రజాస్వామ్యానికే గండం అంటూ వ్యాఖ్య

కుత్బుల్లాపూర్: ఓటు హక్కు వినియోగంపై అనేక రకాలుగా ప్రచారాలు నిర్వహిస్తున్నా ఓటు వేసే విషయంలో ఓటరు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ఓటు హక్కు నమోదు చేసుకోవడమే తప్ప.. పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటు వినియోగించుకోకుండా దూరంగా ఉండటం జరుగుతూ వస్తోంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి రెండు నెలల నుంచి విస్తృత ప్రచారం కల్పించి ప్రజల్లో ఓటు హక్కు విలువను వివరిస్తూ అవగాహన సదస్సులు నిర్వహించినా ఫలితం మాత్రం శూన్యం. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ సరళి పూర్తయ్యేసరికి 50.19 శాతం మాత్రమే పోలింగ్ జరగడం గమనార్హం. ఇలా సగం మంది ఓటింగ్ వేసేందుకు దూరంగా ఉండటం ప్రతిసారి ఓటింగ్ శాతం గణనీయంగా పడిపోతోంది. ఓటింగ్ తప్పినసరి చేయాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అప్పుడే 100 శాతం ఓటింగ్ సాధ్యమని పేర్కొంటున్నారు. ఇలాగే ఓటింగ్ శాతం తగ్గుతూ పోతే ప్రజాస్వామ్యానికే గండమని చెబుతున్నారు. మరి ఎన్నికల సంఘం, ప్రభుత్వం కలిసి ఆ దిశగా అడుగులు వేస్తుందా? లేదా అనేది వేచి చూడాలి.

అసెంబ్లీ ఎన్నికల కంటే తక్కువగా...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 6.99 లక్షల ఓటర్లు ఉన్నారు. అందులో 3.69 లక్షల మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. అంటే 52. 79 శాతం పోలింగ్ జరిగింది. తాజాగా జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కేవలం 50.19 శాతం మాత్రమే పోలింగ్ జరగడం గమనార్హం.



ఓటింగ్ శాతం విషయంపై లెక్కలు వేస్తున్న అబ్జర్వర్ ప్రియాంక శుక్లా, అధికారి సైదులు

◆ పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి నియోజకవర్గంలో ఓటర్లు 7.24లక్షలకు పెరిగారు. కానీ కేవలం 3.63లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2.60శాతం ఓటర్లు గడిచిన అసెంబ్లీ తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికలకు వ్యత్యాసం కనిపించింది.

ఇలా కేవలం 50శాతం మాత్రమే ఓటింగ్ జరగడం మూలంగా మరో 50శాతం పైగా ఓటర్లు దూరంగా ఉంటూ వస్తున్నారు.

ఓటింగ్ శాతం తగ్గితే ప్రజాస్వామ్యానికే ముప్పు!

ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పుగా మారే అవకాశాలు ఉన్నాయి. కేవలం ఐడెంటీ కార్డు కోసమే ఓటు హక్కును తయారు చేసుకొని వాడుకుంటున్నారే తప్ప ఓటింగ్ చేసేందుకు ముందుకు రాకపోవడం గమనార్హం. రానున్న రోజుల్లో ఓటింగ్ తప్పనిసరి చేస్తేనే ప్రతి ఎన్నికల్లో 100 శాతం ఓటింగ్ జరిగే అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో, లంబాడి తండాల్లో ఎంతో చైతన్యం కల్పించి అక్కడ 100 శాతం ఓటింగ్ జరుగుతుండగా గ్రేటర్ హైదరాబాద్ నగరం, నగర శివారు ప్రాంతాల్లో మాత్రం ఓటింగ్ సరళి చూస్తే ముక్కు మీద వేలు వేసుకోవాల్సిందే.

2018 నుంచి ఇప్పటి వరకు ఓటింగ్ సరళి..

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 5.16 లక్షల ఓటర్లకు గాను 2. 88 లక్షల మంది ఓటర్లు (55.97 శాతం) తమ హక్కును వినియోగించుకున్నారు.
- 2019 లోక్‌సభ ఎన్నికల్లో 5.60 లక్షల ఓటర్లు ఉండగా 2.77 లక్షల ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడంతో 49.63 శాతం ఓటింగ్ జరిగింది.
- ఇదే క్రమంలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 6.99 లక్షల మంది ఓటర్లు ఉండగా 3.69 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోగా 52.79 శాతం పోలింగ్ జరిగింది.
- తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 7.24 లక్షల మంది ఓటర్లు ఉండగా 3.63 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 50.19 శాతం ఓటింగ్ జరిగినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.